-డా. విజయబక్ష్

# పాత కథే

***'అమ్మా! ఆ నికృష్టుడితో, ఆ శీల హీనుడితో, ఆ పనికిమాలిన వాడితో ఇంకా ఎందుకు? వాడ్ని వదిలి జీవించలేవా?'***

***'నిర్మలా! తండ్రిని పట్టుకొని వాడూ వీడూ అంటావా?' తల్లి మందలింపు.***

'అతను తండ్రా! ఏ ఆడదానితో పడితే ఆ ఆడదానితో తిరిగేవాడు తండ్రి! అతనొక తండ్రి? భర్తా? మేం కొద్దోగొప్పో చదువుకున్నాం. నిన్ను మేం పోషించుకోలేమా?' నిర్మల గొంతు ఖంగున మోగింది.

ముప్ఫై ఏళ్ళ క్రితం నిర్మల తల్లితో వాదించేటపుడు తండ్రిని గూర్చి చాలా హీనంగా మాట్లాడింది. పదహారేళ్ళ వయసులో నిర్మలకు తండ్రి వికారపు చేష్టలు, తల్లి విచారం ఎంతో బాధ కలిగించేవి. ఎలాగయినా సరే తల్లిని ఆ నరక కూపం నుండి తప్పించాలని ఆరాటపడేది.

తండ్రి పరంధామయ్యకు వ్యవసాయం, వ్యాపారంలో బాగా కలిసి వచ్చింది. అందుకు భార్య లక్ష్మి వచ్చిన వేళా విశేషమని అనేవారు. అయితే పరంధామయ్యకు ఉన్న ఏకైక బలహీనత - స్త్రీ వ్యామోహం. అదే నిర్మలకు అసహ్యం పుట్టించేది. అటువంటి వాడితో అమ్మ అసలెందుకు కాపురం చెయ్యాలి. మధ్యమధ్యలో ఈ విషయం తలుచుకుని ఆవిడ ఏడుస్తుండేది. అయినా భర్తతో కాపురం చేస్తూనే ఉండేది. తండ్రితో విడిపొమ్మని నిర్మల గొడవ పడేది.

తల్లి వచ్చే ఏడుపు ఆపుకుంటూ 'బయటికి వెళ్తాను ఆయన్ని కాదని. అపుడు మీకు పెళ్ళిళ్ళు ఎట్లా జరుగుతాయి. తమ్ముడి చదువు ఏమౌతుంది? ఏది ఏమయినా భర్త ఎలాటి వాడయినా. దుర్మార్గుడయినా, సన్మార్గుడైనా అతన్ని వదిలి వేసిన స్త్రీకి మన సంఘంలో గౌరవం లేదు. పిల్లలకు అండ ఉండదు. నా రాత ఇంతే. నా బ్రతుకింతే కన్నా తెల్లారిపోనీండి. దీని మీద వాదులాటలు... అనేది ఆమె కళ్ళ ముందే రోజులు గడిచి... వత్సరాలు [illegible] పోయాయి. అక్క నీరజకు డాక్టర్‌తో పెళ్ళి జరిపించాడు పరంధామయ్య. మరో ఏడాదిలో నిర్మలను ఇంజనీర్‌కి ఇచ్చి పెళ్ళి జరిపించాడు. అందరూ పరంధామయ్య కూతుళ్ళకు చాలా మంచి సంబంధాలు తెచ్చాడని మెచ్చుకున్నారు. పరంధామయ్య కొడుకు కూడా ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అయినా లక్ష్మమ్మ [illegible] వదల్లేదు. పరంధామయ్య స్త్రీ వ్యామోహం చంపుకోనూ లేదు. వివాహ వ్యవస్థ అంటేనే అసహ్యం వేసిన నిర్మలకు తన వివాహం జీవితాన్ని అందంగా మార్చివేయటం ఆశ్చర్యం వేసింది. నిర్మల భర్త భాస్కర్ చాలా మంచివాడు. గుణవంతుడు. సహృదయుడు. జీవితంపట్ల నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉన్నవాడు. ఆదర్శాలు, ఆశయాలు ఆచరణలో చూపేవాడు. నిర్మలను మనస్ఫూర్తిగా ప్రేమించటమే కాదు. ఆరాధించేవాడు. ఆమె అంగీకారం లేకుండా, ఆమెను సంప్రదించకుండా ఏ ఒక్క పనీ చేవాడు కాదు. భాస్కర్ - నిర్మల దాంపత్యం సమాజానికొక ఆదర్శం... ఒక మోడల్... వాళ్ళ ప్రేమ పంటలే దివ్య... దివాకర్... దివ్య మెడిసిన్ చదువుతోంది. దినకర్ ఇంటర్ చదువుతున్నాడు. మంచి బంగళా... కారు... జీవితంలో లోటు, వెలితి తెలీదు ఇంట్లో వారికి... జీవితంలో ఆనందపు టంచులు చూస్తున్న నిర్మలకు అక్క నీరజ విషయం ఒక అర్థంకాని పజిల్. నీరజ భర్త డాక్టర్ ఆనంద్‌కు మంచి పేరుంది. చాలా డబ్బు గడించాడు. అయితే ఆయన తన దగ్గర పనిచేసే నర్సుతో సంబంధాన్ని వదులుకోలేక పోతున్నాడు. నీరజని చూడటానికి వెళ్ళిన నిర్మల అక్క దుస్థితికి కలత చెందింది. తల్లి కూడా అక్క దగ్గరే ఉంది. నీరజ ఆ నర్సుని వదిలెయ్యమని బ్రతిమాలిందట. అది లేకుండా ఒక్క నిమిషం ఉండను. అయినా నీకు అన్యాయం చెయ్యను అన్నాడట. నిర్మల కిది చాలాచాలా విచిత్రంగా తోచింది. అసలు ఈ మాటల కర్థం ఏమిటి? మగవాళ్ళు తప్పు ఆడవాళ్ళు ఇలా చేస్తే ఈ సమాజం అంగీకరిస్తుందా హర్షిస్తుందా?



నిర్మలకు స్త్రీ స్వేచ్ఛను గూర్చి అపుడు అనుమనమొచ్చింది మొదటిసారిగా.

స్త్రీవాదమని... సంకెలలు తెంచుకోమని... అదనీ... ఇదనీ చెప్పే స్త్రీలలో ఎంతమంది కాపురాలను తెగత్రెంచుకుని బయట పడగలిగారు అని. స్త్రీలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సొంత ఆలోచన లేవని తాను అనుకునేది. కాని అవన్నీ ఇన్ని రకాలయిన విషయాలతో ముడిపడినవన్నమాట... ఏమయినా అమ్మ, అక్క చేతగాని వాళ్ళు. పిరికిపందలు!

* * *

నిర్మల చిత్రలేఖనం ఎగ్జిబిషన్‌లో పోటీకై చిత్రాన్ని దీక్షగా గీస్తున్నది. భాస్కర్ ఆ రోజు ఆఫీసు నుండి వచ్చాక ఇద్దరూ రంగుల మిశ్రమం గురించి ఆలోచించాలనుకున్నారు. ఆ రోజు భాస్కర్ చాల అలసిపోయి, నీరసంగా, నిస్తేజంగా మాట్లాడలేని స్థితిలో వచ్చాడు. నిర్మల అతన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఎప్పుడూ నవ్వుతూ ఉండే అతన్ని అందరూ 'నిత్యానందం' అంటారు. అలాటి అతను అంత విచారంగా ఉండటం నిర్మల తట్టుకోలేక పోయింది.

'ఏమండీ! ఏమిటలా ఉన్నారు?' అంటూ బ్రష్‌ని వదిలేసి అతని ప్రక్కన కూర్చొని అతని చేతిని తన చేతిలోకి తీసుకొంది. ఆ స్పర్శ చాలు భాస్కర్‌కి ఊరట కలగటానికి. చిన్నపిల్లాడిలా, తల్లి వొడిలో ఓదార్పు చెందే కొడుకులాగ భాస్కర్ మెల్లగా చెప్పాడు.

'నిర్మలా! మా ఆఫీసులో ముకుంద్ ఉన్నాడుగా. చాల మంచివాడు. అతను తరచూ క్యాంపులకు రాజమండ్రి వెళ్తూండేవాడు. ఎలా పరిచయమో, ఏమో ఒకామెతో ఇతనికి స్నేహం బలపడింది. ముకుంద్, ఎలిజెబెత్‌లది ప్రేమ వివాహం అని నీకు తెలుసుగా. ఇద్దరు చిన్నపిల్లలు వాళ్ళకి. బాగా సంస్కారం, చదువు ఉన్నవాళ్ళే. పెద్ద ఉద్యోగస్థులే. ఒకళ్ళంటే ఒకరికి ఎంతో ప్రేమ. ఎలిజెబెత్ మొన్న రాత్రి గొడవ చేసిందట. ఏమిటని నిలదీసిందట. అతను ఆఫీసు నుండి వచ్చింత్వర్వాత అతని పర్సులో 'ప్రేమలేఖ'ను చూసి... ముకుంద్ సంగతి నీకు తెలుసు కదా. ఏ విషయం స్పష్టంగా చెప్పడు. ఎంతో హుందాగా ఎలిజెబెత్ నిజం చెప్పండి అని అడిగింది. అయినా ముకుంద్ మౌనం వహించాడు. ఆమెతో చెప్పటానికి సిగ్గుపడ్డాట్ట. పోనీ చెప్పలేనివాడు ఆమెకు ఓ ఉత్తరం అయినా రాయవచ్చు కదా. అదీ చేయలేదు. నాకివాళ లంచ్‌లో ఇదంతా చెప్పాడు. నేను 'చాలా తప్పు చేశావ్! ఆమె ముందు అన్నీ చెప్పి క్షమాపణ వేడుకోమన్నాను... కాని నిమ్మీ! అప్పటికే చాలా లేటయింది. ఆమె పురుగుల మందు తాగింది. ఇప్పుడు మృత్యువుతో పోరాటం చేస్తున్నది. డాక్టర్లు లాభం లేదన్నారు. నీకు చెప్పి నిన్ను తీసుకువెళ్దామని వచ్చాను...'

నిర్మల అతని జుట్టులోకి వేళ్ళు జొనిపి ఓదారుస్తూ 'వెళ్దాం పదండి' అంటూ లేవబోయింది. వంట మనిషి సుబ్బలక్ష్మి రెండు కప్పులు కాఫీతో ఎదురుగా నిలబడింది. ఆబగా భాస్కర్‌నే చూస్తున్నది. మరి అతనిది కన్నుచెదిరే అందం.

